
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.2
***
ANDHRAJYOTHY



నల్లగొండ
5
సోమవారం 11 నవంబరు 2024



నృసింహుడికి శాస్త్రోక్తంగా
నిత్య పూజలు
- భక్తజనసంద్రంగా క్షేత్రం
- స్వామివారిని దర్శించుకున్న 40వేల మంది భక్తులు

6



మిర్యాలగూడ-కోదాడ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

- తేమ పేరుతో మద్దతు ఎగ్గొడుతున్న మిల్లర్లు
- సన్న ధాన్యం విక్రయాల్లో అవస్థలు
- భారీగా ధాన్యం రావడంతో కొనుగోళ్లను నియంత్రించిన మిల్లర్లు
- మిర్యాలగూడలో మిల్లుల వద్ద రైతుల ధర్నా
- రెండు ప్రధాన రహదారులపై రెండేసి గంటల పాటు ఆందోళనలు

దగాపడుతున్న ధాన్యం రైతు

ధాన్యం రైతులు దగాపడుతున్నారు. వరికోతలు విస్తృతమవడం, ధాన్యం భారీగా వస్తుండడంతో ఇదే అదనుగా మిల్లర్లు తేమసాకుతో ధర ఎగ్గొడుతున్నారు. ఆరుగాలం పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర రాకపోవడంతో ఆవేదన చెందుతున్న రైతులు మిల్లుల వద్ద రోడ్లపై ధర్నాలు, రాస్తారోకో చేశారు.

- నల్లగొండ, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ మిర్యాలగూడ రూరల్/వేములపల్లి

జిల్లాలో రైస్‌మిల్లులు అత్యధికంగా ఉన్న మిర్యాలగూడలో ఆదివారం రోజంతా రైతులు ధర కోసం మూడు ప్రధాన రహదారులపై ధర్నాలు నిర్వహించారు. సన్న ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు సిండికేట్ అవడంవల్లే ఉన్నట్లుండి ధర తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని సాగర్ ఆయకట్టు నుంచి ధాన్యం విస్తృతంగా వస్తుండడంతో మిల్లర్లు ధర తగ్గించారని, ఇదే మిల్లర్లు గత ఏడాది క్వింటాకు రూ.2800 ఇచ్చారని, ఈ సీజన్‌లోనూ గతవారం వరకు క్వింటాకు రూ.2400 వరకు ధర ఇచ్చారని, ఇప్పుడు ధర తగ్గించి అన్యాయం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోళ్లు చేయకపోవడంతో రాస్తారోకోలు

ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో వరికోతలు ఉధృతంగా సాగుతున్నాయి. వీటిల్లో సన్నరకం ధాన్యాన్ని రైతులు ఎప్పటికప్పుడు వెనువెంటనే ట్రాక్టర్లలో నింపుకొని నేరుగా మిర్యాలగూడలోని మిల్లుల వద్దకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. గత వారం క్రితం వరకు పచ్చి ధాన్యాన్ని సైతం తేమతో సంబంధం లేకుండా మిల్లర్లు క్వింటాకు రూ.2400 వరకు ధర చెల్లించారు. ఆ ధర ఉంటుందనే నమ్మకంతో ట్రాక్టర్లలో రైతులు ధాన్యం తేవడం ఎక్కువైంది. దీన్ని పసిగట్టిన మిల్లర్లు సిండికేట్‌గా మారి శనివారం సాయంత్రం నుంచి మిర్యాలగూడ, వేములపల్లి మండలాల పరిధిలోని మిల్‌పాయింట్ల వద్ద కాంటాలు నిలిపారు. దీంతో ఇటు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారివెంట ఉన్న మిల్లుల వద్ద, మిర్యాలగూడ-కోదాడ రహదారి వెంట ఉన్న మిల్లుల వద్ద మూడువేల పైచిలుకు ధాన్యం ట్రాక్టర్లు నిలిచాయి. ఆదివారం ఉదయం 10గంటల వరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు రెండు ప్రధాన రహదారులపై రాస్తారోకో చేశారు. దీంతో రెండు రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రెండు గంటల పాటు నిలిచింది. విషయం తెలిసిన వేములపల్లి తహసీల్దార్ కోటేశ్వరి, మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు, ఎస్ఐ వెంకటేశం, లోకేశ్ అక్కడికి చేరుకొని మిల్లర్లు, రైతులతో చర్చించి ట్రాక్టర్లను మిల్లులోకి పంపారు. ధర ఇవ్వాలని, కొనుగోళ్లు జరపాలని మిల్లర్లకు తహసీల్దార్ ఆదేశాలిచ్చినా, తేమ నిబంధనను సాకుగా చూపుతూ క్వింటాకు రూ.2,200కి మించి ధర ఇవ్వలేమని మిల్లర్లు తూకాలు వేశారు. మరోవైపు రైతుల ఆందోళనల విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి వెంట ఉన్న శెట్టిపాలెం వద్ద ఉన్న మిల్లుల వద్దకు చేరుకొని మిల్లర్లతో చర్చలు జరిపి, కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందేనని మిల్లర్లను హెచ్చరించారు.

భారీగా ధాన్యం వస్తుండడంతో సిండికేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు సన్న ధాన్యాన్ని మిర్యాలగూడ మిల్లుల వద్ద విక్రయించడం ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ. ఇక్కడ మాత్రమే అత్యాధునిక సాంకేతికత, ఎక్కువ మిల్లింగ్ సామర్థ్యం ఉన్న మిల్లులున్నాయని, ఇక్కడే ధర దక్కుతుందనే విశ్వాసంతో రైతులు ఇక్కడికి వస్తుంటారు. అందుకే ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం ఇక్కడికే వస్తోంది. శని, ఆదివారాల్లో సైతం భారీగా ధాన్యం వచ్చింది. వాస్తవానికి మిర్యాలగూడలో ఉన్న 84 రైస్‌మిల్లుల్లో 16మిల్లులు అత్యాధునిక టెక్నాలజీ ఉన్నవి. ఈ మిల్లుల్లో తేమశాతంతో సంబంధం లేకుండా 26శాతం తేమ ఉన్నా బియ్యం నాణ్యంగా వస్తుంది. అయితే ప్రభుత్వ నిబంధన తేమశాతం 17కి మించవద్దని ఉండడంతో, దీన్ని ఆసరా చేసుకొని మిల్లర్లు రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. భారీగా ధాన్యం వస్తుండడంతో మిల్లర్లు సిండికేట్ మారడం, అన్ని మిల్లుల్లో సీజన్‌లో అన్ని రోజులు...

- మిగతా 8వ పేజీలో...

మద్దతు ధర ఇవ్వకుంటే సీజ్ చేస్తాం



మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తే సంబంధిత రైస్ మిల్లును సీజ్ చేస్తాం. రైస్ మిల్లరు మద్దతు ధర కన్నా తక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తే అన్ని రకాల లైసెన్స్‌లు మార్కెటింగ్, ఫుడ్ సేఫ్టీ, పొల్యూషన్, విద్యుత్ తదితర రద్దు చేస్తాం. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర, బోనస్ పొందాలి.

- ఇలా త్రిపాఠి, కలెక్టర్

సర్వేకు ప్రజలు సహకరించాలి : కలెక్టర్



సర్వేలో వివరాలు నమోదుచేయించుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

దామరచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఆదివారం మండలంలోని వాడపల్లిలో సర్వేను తనిఖీచేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వే సందర్భంగా అధికారులు అడిగిన సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆమెకు పూజారులు ఆలయ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట తహసీల్దార్ జవహర్‌లాల్ ఉన్నారు.

సర్వేలో వివరాలు నమోదుచేయించుకున్న కలెక్టర్, ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ, నల్లగొండ క్రైం): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఆదివారం కలెక్టర్ ఇలా త్రిపాఠీ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వారి కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్ వద్ద నమోదు చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, మునిసిపల్‌కమిషన్ ముసాబ్ అహ్మద్, సూపర్‌వైజర్ జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే తేదీని ముందే చెప్పాలి

(ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్): సమగ్ర కుటుంబ సర్వేకు ఏ రోజు వెళ్తారో ఆ తేదీని ముందుగానే ఆ బ్లాక్‌లోని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నందికొండ మునిసిపల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లతో సమావేశమై సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లో తిరిగి సర్వేను తనిఖీచేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 3,970 బ్లాకుల్లో సుమారు 5.09లక్షల ఇళ్లు ఉన్నాయన్నారు. ముందుగా ప్రతీ ఇంటికి స్టికరింగ్ పూర్తిచేశామని, ఈ నెల 9 నుంచి వివరాల నమోదు ప్రారంభించామని, ఒక్క రోజులో 25,324 ఇళ్ల సర్వే పూర్తయిందన్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో సర్వే వేగవంతమైందన్నారు. సర్వే సిబ్బందికి ఎటువంటి డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆధార్‌కార్డు, ధరణి లాంటి ధ్రువపత్రాలు చూపిస్తే సరిపోతుందన్నారు.

న్యూస్ బాక్స్

అంబుజా సిమెంట్ మైనింగ్ విస్తరణపై 12న ప్రజాభిప్రాయ సేకరణ



అంబుజా సిమెంట్ పరిశ్రమ

దామరచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్‌పహాడ్ గ్రామ సమీపంలోని పెన్నా సిమెంట్ (ప్రస్తుత అంబుజా) సిమెంట్ పరిశ్రమ మైనింగ్ విస్తరణపై ఈనెల 12న పరిశ్రమ ఆవరణలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. 2002లో పెన్నా సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఇక్కడ కర్మాగారాన్ని నిర్మించింది. ఇటీవల పరిశ్రమను అదానీ గ్రూప్ కొనుగోలు చేసి అంబుజా సిమెంట్‌గా పేరు మార్చింది. మండలంతోపాటు సూర్యాపేట జిల్లా ఖాన్యపహాడ్ గ్రామ పరిధిలో మొత్తం 354 హెక్టార్లలో మైనింగ్ గనులు విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.8మిలియన్ టన్నులకు పెంచేందుకు పరిశ్రమ యాజమాన్యం గనులశాఖ, కాలుష్య నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో 12వ తేదీన అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు.

త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదే

నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

వేములపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన కొట్లాడి త్యాగాలు చేసిన వారంతా కమ్యూనిస్టులేనన్నారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి డిసెంబరు 26నాటికి 100 ఏళ్లు పూర్తి చేసుకుంటోందన్నారు. దేశంలో బీజేపీ మాయ మాటలు, మోసపూరితమైన వాగ్దానాలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ సైతం ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి హామీల అమలులో విఫలమైందన్నారు. హామీలను అమలు చేయకపోతే ఉద్యమిస్తామన్నారు. డిసెంబరులో నల్లగొండ నిర్వహించే బహిరంగసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బంటు వెంకటేశ్వర్లు, జిల్లా యాదగిరి, వెన్నెల వెంకన్న, నల్ల వెంకన్న, పుట్టల కృష్ణ, పాల్గొన్నారు.



జరిమానాలేగా.. వేసుకోనీ!

- నిబంధనలు పాటించని వాహనదారులు
- అతివేగంతో ప్రమాదాలు
- గత ఏడాది 47,147 కేసులు
- ఈ ఏడాది 24,409 కేసులు నమోదు

జిల్లా రహదారులు నిత్యం నెత్తురోడుతున్నాయి. ఇంటి నుంచి వాహనాలపై బయటికి వెళ్లిన వ్యక్తులు తిరిగి క్షేమంగా చేరుకుంటారనే నమ్మకం సన్నగిల్లుతోంది. ఏదో ఒక చోట వాహన ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరికొంత మంది క్షతగాత్రులవుతున్నారు. ఈ ప్రమాదాలకు అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ క్రైం)


నిబంధన ఉల్లంఘన	2023లో కేసులు	2024లో కేసులు
ట్రిపుల్ డ్రైవింగ్	4021	5,800
హెల్మెట్ లేకపోవడం	1879	780
సెల్ ఫోన్ డ్రైవింగ్	3168	4,496
సీట్ బెల్ట్ ధరించకపోవడం	2160	969
అధిక వేగం	35435	11,736
సిగ్నల్ లైట్ జంపింగ్	-	286
రాంగ్ రూట్ డ్రైవింగ్	195	162
ఆటోలో పరిమితికి మించి	289	180
మొత్తం	47,147	24,409
జరిమానా	రూ.4,30,76,300	రూ.2,22,69,700

పోలీసులు ప్రతి రోజు వాహన తనిఖీలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తున్నా వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. జరిమానా చెల్లిస్తున్న వాహనదారులు షరామామూలంటూ ట్రాఫిక్ నిబంధనలను మళ్లీ ఉల్లంఘిస్తూనే ఉన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. జిల్లాలో గతంలో రహదారుల విస్తరణ జరగకముందు పలు ప్రమాదాలు జరుగుతుండేవి. దీంతో రహదారులను విస్తరించగా, ప్రమాదాలు తగ్గాల్సింది పోయి పెరుగుతున్నాయి. రహదారుల విస్తరణతో వాహనాల వేగం పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా అతి వేగం, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని అధికారులు ..

- మిగతా 8వ పేజీలో...

అద్దె బకాయిలు చెల్లించండి

- సాగర్ మునిసిపాలిటీలో నోటీసులు జారీచేసిన ఎన్నెస్పీ అధికారులు
- ఆందోళనలో నివాసితులు
- ఇప్పటికే జీవో 58, 59 ద్వారా ఇళ్ల క్రమబద్ధీకరణ
- దీనిపై ఎలాంటి సమాచారం లేదంటున్న డీఈ



ఎన్నెస్పీ అధికారులు జారీ చేసిన నోటీసు

నాగార్జునసాగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఉద్యోగులు, ఇంజనీర్లు నివాసం ఉండేందుకు ప్రభుత్వం ఇక్కడ క్వార్టర్లను నిర్మించింది. ఆరు దశాబ్దాలుగా ఈ నివాస గృహాలు ఎన్నెస్పీ పరిధిలో ఉన్నాయి. అయితే ఇక్కడ నివసిస్తున్నవారు వాటిని తమకు క్రమబద్ధీకరించాలని ఏళ్లుగా కోరుతున్నారు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 58, 59 ద్వారా నివాస గృహాల క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంది. మొత్తం 1,351 నివాస గృహాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, 500 మందికి క్రమబద్ధీకరణ పూర్తయింది. తిరిగి రెండో విడత క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, గత నవంబరు నెలలో ఎన్నిల కోడ్ అమలులోకి రావడంతో దీనికి బ్రేక్‌పడింది. తొలి విడతలో క్రమబద్ధీకరణ పొందిన యజమానులు పాత అద్దె బకాయిలు చెల్లించాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ నాయకులు గతంలో హామీ ఇచ్చారు. సుమారు ఐదారేళ్లుగా ఇంటి యజమానులు అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆ తరువాత ఎన్నెస్పీ అధికారులు సైతం ఎవ్వరికీ నోటీసులు జారీ చేయలేదు. కాగా, రెండు రోజుల క్రితం పాత బకాయిలు చెల్లించాలని క్రమబద్ధీకరణ పొందిన గృహ యజమానులతోపాటు మిగతా వారికి సైతం ఎన్నెస్పీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో నివాసితులు ఆందోళన చెందుతున్నారు. క్రమబద్ధీకరించిన నివాస గృహాలకు డబ్బు చెల్లించడం ఏంటని వారు వాపోతున్నారు. ఈ విషయంపై బీఅండ్‌ఆర్ ఎన్నెస్పీ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇళ్ల క్రమబద్ధీకరణ జరిగినట్లు తమకు రెవెన్యూశాఖ, కలెక్టరేట్ నుంచి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. కాలనీలోని ఇళ్లకు ఎన్నెస్పీ నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, అందుకే నోటీసులు జారీ చేశామని ఆయన తెలిపారు.

వైభవంగా సదర్ సమ్మేళనం

ఆకట్టుకున్న పోతరాజులు, డోలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు



సమ్మేళనంలో మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

నల్లగొండ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన యాదవుల సదర్ సమ్మేళనం అట్టహాసంగా సాగింది. సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం అధికారిక పండుగగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని వసతులు కల్పించింది. సమ్మేళనంలో భాగంగా ప్రత్యేకంగా దున్నపోతులను అలంకరించి పూజలు చేసిన అనంతరం డోలు చప్పుళ్ల మధ్య పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఎన్జీ కళాశాల మైదానానికి తీసుకువచ్చారు. హైదరాబాద్ రోడ్డు పాలకేంద్రం నుంచి మొదలైన ఈ ఊరేగింపులో గోమాతలు, శ్రీకృష్ణుని వేషాధారణ, డోలు, ఒగ్గు కళాకారుల ప్రదర్శన, భజన బృందం, మహిళల కోలాటం, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్య శివకుమార్, శ్రీశైలం, పాల్గొన్నారు.



చేతివృత్తిదారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బండా శ్రీశైలం

మునుగోడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడులోని అమరవీరుల భవనంలో జరిగిన చేతివృత్తిదారుల నియోజకవర్గస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. దీంతో వృత్తిదారులు ఉపాధి కోల్పోయి ఇతర వృత్తులకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పట్టించుకొని వృత్తిదారుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఉచిత విద్యుత్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ధనుప రజయ, సాగర్ల మల్లేష్, ముత్యాలు, శ్రీను, వెంకన్న, రాజయ్య, అంజయ్య, రామలింగ చారి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్కైబాబా సాహిత్యం భావితరాలకు స్ఫూర్తి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుంకిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

నల్లగొండ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కైబాబా సాహిత్యం భావి తరాలకు స్ఫూర్తినిస్తుందని సాహితీ వేత్త డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన 'స్కై 30' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్కైబాబా కవిత్వం, కథలు, నవలలు సమాజానికి ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. 'స్కై 30' పుస్తకాలు, 70కి పైగా రచనలు వెలువడ్డాయని అన్నారు. అనంతరం స్కైబాబా సాహిత్యం ఆచరణపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో పుస్తక రచయిత స్కైబాబా, సాహితీవేత్తలు మునాస వెంకట్, అంబటి వెంకన్న, పెరుమాళ్ల ఆనంద్, రహమతుల్లా, పద్మ, పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మత్స్యశాఖ జిల్లా అధికారి చరిత




అక్కంపల్లి రిజర్వాయర్‌లో చేపలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ అధికారి చరిత

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని, అందులో భాగంగా పలు సబ్సిడీ పథకాలు అమలుచేస్తోందని మత్స్యశాఖ జిల్లా అధికారి చరిత అన్నారు. ఆదివారం మండలంలోని అక్కంపల్లి రిజర్వాయర్‌లో 6లక్షలు, పుట్టంగండి బ్యాక్ వాటర్‌లో 3లక్షల చేప పిల్లలను వదిలారు. ముందుగా రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహించి చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రవ్వ, బొచ్చ, మిరగాలు చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలినట్టు తెలిపారు. చేప పిల్లలను ఉచితంగా పంపిణీచేస్తున్నామని, దీన్ని మత్స్యకార సభ్యులు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 695 చెరువుల్లో 2.98కోట్ల చేప పిల్లలు విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 83లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. 10-15 రోజుల్లో మిగిలిన చేప పిల్లలను చెరువుల్లో వదులుతామన్నారు. కొప్పోలులోని చింతల చెరువులో విడుదల చేసేందుకు సరఫరా చేసిన 43,500 చేప పిల్లలు సైజు చిన్నవిగా ఉన్నట్టు గుర్తించి వాటిని తిప్పిపంపినట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జిల్లా సంఘం డైరెక్టర్ సింగం లక్ష్మీ వెంకటయ్య, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మాజీ చైర్మన్ తాళ్ల మల్లయ్య, మాజీ కార్యదర్శి అమర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

వి'చిత్రం'

● స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తిరుగులేని ప్రతిభ
● అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న అంజనేయులు



ఏదైనా కళ్లతో చూస్తేనే కానీ నమ్మలేం అంటాం.. ఎందుకంటే మన కళ్లు మనని మోసం చేయవని, కానీ అంజనేయులు వేసిన పెయింటింగ్ చూస్తే మన కళ్లు మనని మోసం చేయడం ఖాయం. సహజత్వం ఉట్టిపడేలా ఉంటాయి ఆయన వేసిన చిత్రాలు. ఒకసారి తాకిచూస్తేనే కానీ అవి ఫొటోలు కావు పెయింటింగ్ అని తెలియడానికి, పోల్చలేనంతలా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వస్తువులకు ఆధునికతను జోడించి ఇప్పటి వారికి నచ్చేలా వేస్తాడు. ఆయన చిత్రం వైపు కన్ను పడిందంటే చాలు కొన్ని నిమిషాలు అలా అలవోకగా గడిచిపోతాయి. ఒక చిత్రం కోసం ఎన్నో గంటలను ధారపోస్తాడు. దేశంలో స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పెయింటింగ్ రంగంలో ఎదుగుతున్న అంజనేయులు జీవన ప్రస్థానం ఇది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)







సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో చేనేత కుటుంబానికి చెందిన గుండు సత్యం, లక్ష్మమ్మలకు ఐదుగురు సంతానంలో ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులు చిత్రకళలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మూడోకుమారుడు అంజనేయులు చిత్రకళలో రియలిస్టిక్ పద్ధతిలో అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధిస్తున్నారు. తండ్రి మగ్గం పడితే కుమారుడు కుంచె పట్టి దానికి పదును పెట్టి దానినే తన వృత్తిగా మలుచుకున్నాడు. ఉన్నది ఉన్నట్లు, ఉండదు కనికట్టు అన్నట్టుగా రియలిస్టిక్ పద్ధతిలో అనేక చిత్రాలను రూపొందిస్తున్నారు.

ఎన్నో ఆటుపోట్లు

ప్రతీ ఏడాది చిత్రకళను నేర్చుకుని కళాకారులుగా ఎంతోమంది కళాశాలల నుంచి వస్తుంటారు. అలా వచ్చిన వారిలో వెయ్యిలో ఒకరిద్దరూ తప్ప ఆ రంగంలో ఉచ్ఛస్థాయికి చేరుకోలేరు. అది అంతసాధ్యమయ్యేది కాదు. ఆర్థిక వనరులు, సామాజిక పరిస్థితులతో పాటు అన్నింటిని మించి మార్కెట్‌లో దక్కాల్సిన ఆదరణ అనేది ఒక ఆర్టిస్ట్ ఎదుగుదలకు ఉన్న అతిపెద్ద ప్రతిబంధకం. వీటికి తోడు చిత్రకళా రంగంలో కొత్తదనం లేకుంటే ఏ చిత్రానికైనా గుర్తింపు రాదు. జెఎన్‌టీయూలో ఫైన్‌ఆర్ట్‌లో చదివిన అంజనేయులు 2002లో చిత్రకళా రంగంలో అడుగుపెట్టినప్పటికే రాష్ట్రంలో ఎంతోమంది పేరుగాంచిన చిత్రకారులున్నారు. వారందరితో పోటీ పడుతూ చిత్రకళా ఎగ్జిబిషన్‌కు ఎంపిక కావడం ఆయనకు సవాల్‌గా మారింది. దీంతో స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తన ప్రతిభకు పదునుపెట్టారు. 2006లో హైదరాబాద్‌లో తన చిత్రాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన వచ్చినా, ఆర్థికంగా పెద్దగా విజయవంతంకాలేదు. అయినప్పటికీ కుటుంబంలో ఆర్థిక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే నిరాశ చెందకుండా ఎన్నో చిత్రాలు వేశారు. ఆ తర్వాత 2013, 2015లో సోలో ఆర్ట్ షో ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. ఢిల్లీలో జరిగిన అనేక పెయింటింగ్ ప్రదర్శనల్లో అంజనేయులు గీసిన స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ చిత్రాలు ఆకట్టుకోగా వాటిని ఖరీదైన రేటుకు కొనుగోలు చేశారు.

హృదయాన్ని పెట్టాల్సిందే

సాధారణ పెయింటింగ్ వేరు. స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పెయింటింగ్ వేరు. వస్తువులో మన మనస్సు, ప్రాణాన్ని పెట్టాల్సిందే.ఇన్ని గంటలు, రోజులు అని నిర్దిష్టంగా చెప్పలేం. ఒక్కోసారి నెలలు పడుతుంది. ఆర్టిస్ట్‌లకు తమ ప్రయాణంలో గుర్తింపు అనే అత్యంత క్లిష్టమైన అంశం. వినూత్నంగా, ప్రస్తుత సమాజాన్ని ఆకట్టుకునేలా ఉంటేనే చిత్రాలకు, వారికి మనుగడ ఉంటుంది. ఏస్థాయిలో ఉన్నాయన్నది కాదు, ఎంతమంది హృదయాల్లో గుర్తింపుగా ఉండిపోతామనేది లక్ష్యంగా ఉండాలి.

గుండు అంజనేయులు,
స్టిల్ లైఫ్ రియలిస్టిక్ ఆర్టిస్ట్





పలువురి ప్రశంసలు


అంజనేయులు వేసిన స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ చిత్రాలు దేశంలోని ఎంతో మంది ప్రముఖులను ఆకట్టుకున్నాయి. అన్నింటిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ప్రశంసను మరిచిపోలేనని అంజనేయులు అన్నారు. 2014లో హైదరాబాద్‌లో మెట్రో పోలీస్ సదస్సుకు వచ్చిన సందర్భంగా ఆర్ట్ ఎట్ తెలంగాణ నిర్వహించిన ప్రదర్శనలో అంజనేయులు గీసిన స్టీల్‌బిందె పెయింటింగ్ నచ్చడంతో రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అంజనేయులును పిలిపించుకుని అభినందించారు. ఇటీవల నికిల్‌కామత్ పాడ్‌కాస్ట్‌లో అంజనేయులు చిత్రాలపై చర్చలో ప్రస్తావించారు.



సామాన్యుడి వస్తువులే చిత్రాలు

పోలినట్లుగా ఉండటం వేరు, ప్రాణం పోసినట్లుగా ఉండటం వేరు అంటారు అంజనేయులు. అందుకే తన చిత్రాల్లో ఏచిత్రమైనా మనస్సును తాకేలా ఉంటుందంటారు. గ్రామీణ నేపథ్యాన్ని పట్టణ ఆధునికీకరణను, ఫ్యాషన్ ప్రపంచాన్ని, కంప్యూటర్ టెక్నాలజీని తన కుంచె ద్వారా చిత్రిస్తున్నారు. ఇంట్లోని వస్తువులు స్టీల్‌బిందెలు, బకెట్లు, మగ్గులు ఇలా ఇంట్లో ఏ వస్తువు కనపడినా దానిని ఫొటోచేసి స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పద్ధతిలో ద్వారా అచ్చుగుద్దినట్లు వేస్తున్నారు అంజనేయులు.

మలుపుతిప్పిన ఢిల్లీ ఎగ్జిబిషన్



ఇండియా ఆర్ట్ ఫెయిర్ 2018లో ఢిల్లీలో నిర్వహించారు. ఈ ఫెయిర్‌కు కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ వంటి ఎంతోమంది ప్రజాప్రతినిధులు, కార్పొరేట్లు, వివిధ రంగాల్లో పేరెన్నికగన్న వారు హాజరయ్యారు. అందులో అంజనేయులు వేసిన పెయింటింగ్ అందరినీ ఆకట్టుకుంది. వచ్చిన వారిలో చాలామంది పెయింటింగ్‌ను తదేకంగా చూస్తూ ఉండిపోవడం ఆర్ట్ ఫెయిర్ నిర్వాహకులను ఆకట్టుకుంది. ఇక అక్కడి నుంచి తన పట్ల చిత్రకళారంగంలోని వారి ఆదరణలో మార్పు వచ్చిందంటారు అంజనేయులు. ఆ తర్వాత దుబాయ్, పారిస్, అమెరికాతో పాటు వివిధ దేశాల్లో అంజనేయులు తన చిత్రాలను ప్రదర్శించారు.



చార్మినార్ వద్ద గంటల సమయం

ఒక్కో పెయింటింగ్‌కు ఎన్నో గంటల సమయం పడుతుందని, ఒక్కోసారి రెండు, మూడు నెలల పాటు పెయింటింగ్ కోసం శ్రమించాల్సి వస్తుందని అంజనేయులు పేర్కొన్నారు. తాను వేసిన చార్మినార్ పరిసర ప్రాంతాలతో కూడిన చిత్రానికి రెండు నెలల సమయం పట్టిందని, ఇందుకోసం చార్మినార్ చుట్టు ప్రాంతాలను గమనించడానికే తాను రెండు నెలల సమయం తీసుకున్నట్లు తెలిపారు. అంజనేయులు గీసిన వాటిలో టేప్‌రికార్డర్ పెయింటింగ్ అత్యధిక ధరకు విక్రయించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రభాత సేవతో యాదగిరీశుడు, అమ్మవారలను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయ రీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష స్వామివారిని దర్శించుకున్నారు. యాదగిరీశుడి క్షేత్రాన్ని ఆదివారం 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం

డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు 10వ జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శిరీష ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తొమ్మిది సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలు, కళాశాలలకు చెందిన 800 మంది విద్యార్థినులు, 18 పీఈటీలు క్రీడలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారం, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరవుతారని తెలిపారు.

రాజాపేట : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 10వ జోనల్‌స్థాయి క్రీడలు ఈనెల 11 నుంచి 14 తేదీ వరకు నిర్వహించనున్నారు. క్రీడాల్లో జనగామ, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా నుంచి క్రీడాకారులు రాజాపేటకు చేరుకున్నారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య క్రీడలను ప్రారంభిస్తారని జోనల్ ఆఫీసర్ విద్యారాణి, ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో సత్తాచాటి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రగ్బీ, వాలీబాల్, హాకీ, చెస్ పోటీలకు సంబంధించి విద్యార్థులు చాటారు. వీరు ఆయా విభాగాల్లో తమ కేటగిరీలకు సంబంధించి పోటీల్లో తలపడనున్నారు.

● రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వెల్లంకి విద్యార్థులు



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

రామన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరిలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు రామన్నపేట మండలం వెల్లంకి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవరకొండలో జరిగిన అండర్-17 జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జి.అభినయశ్రీ, ఈ శివలీల, సీహెచ్ శ్రీలక్ష్మి, జి అవంతిక, కే.తనుశ్రీ, జి.అక్షయ, ఎస్.వైష్ణవి, జే.చైతన్య డి.అక్షితలు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరిలో మూడురోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు వారు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పీడీ రేణుకను ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుల సత్తిరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ యాదగిరి, పారిజాత, ఉమామహేశ్వరి, స్వప్న, హేమలత అభినందించారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఆదిత్య



జాతీయస్థాయి చెస్ పోటీలకు రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఆకుల ఆదిత్య ఎంపికయ్యాడు. ఈ నెల 9వ తేదీన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆకుల ఆదిత్య మంచి ప్రతిభ కనబరిచాడు. మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనను న్నాడు. ఆదిత్య ప్రస్తుతం బొమ్మలరామారం మండలంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదిత్య జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక కావడంపై మునిపంపుల గ్రామస్థులు, బొమ్మలరామారం, టీఎస్ మోడల్‌స్కూల్, ఆధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ పోటీలకు హరీష్



హరీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 10: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మల్లాపురం గ్రామానికి చెందిన పుర్మ సంపత్ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిచే అండర్-19 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి సంపత్‌ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా మౌనిక



డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు డిండి మండలం చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇస్లావత్ మౌనిక కెప్టెన్‌గా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోప్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబర్చిన ఇస్లావత్ మౌనికను జాతీయస్థాయిలో ఆడే కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో యాదాద్రి జిల్లాలోని మాదాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 14(బాలికల) విభాగంలో మౌనిక ఆడి తన సత్తా చాటింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హాకీ పోటీలకు అశ్విత ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

చిట్యాల, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రీన్ గ్రోవ్ పాఠశాలకు చెందిన పిట్టల అశ్విత అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అశ్విత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అశ్వితను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆనందం.. ఆహ్లాదం

● ఉల్లాసంగా నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం ప్రయాణం ● 110 కిలోమీటర్లకు 6గంటల సమయం ● బుధ, శనివారాల్లోనూ రాకపోకలు



ప్రకృతి అందాలను వీక్షిస్తూ..



ప్రయాణంలో అందమైన అనుభూతులెన్నో..



శ్రీశైలంకు బయలుదేరి వెళుతున్న లాంచీ



ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ నుంచి ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలం వరకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో లాంచీ ప్రయాణం ఇటీవల ప్రారంభమైంది. 110 కిలోమీటర్ల దూరం ఉన్న శ్రీశైలం వరకు 6 గంటల పాటు ఈ ప్రయాణం సాగుతుంది. దట్టమైన నలమల అందాల నడుమ కృష్ణమ్మ ఒడిలో లాహిరి...లాహిరి... లాహిరిలో అంటూ ఆహ్లాదకరంగా లాంచీ ప్రయాణం సాగుతోంది. పక్షుల కిలకిల రావాలు, ప్రకృతి అందాలను తిలకిస్తూ పర్యాటకులు సాయంత్రం 5గంటలకు శ్రీశైలం చేరుకుంటారు. ఇక నుంచి పర్యాటకుల రాక మేరకు బుధ, శనివారాల్లో సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం కొనసాగిస్తామని పర్యాటకశాఖ అధికారులు తెలిపారు.

● (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)




లాంచీలో శ్రీశైలం వెళుతున్న పర్యాటకులు



బతుకు పోరులో.. మత్స్యకారులు



ఉల్లాసం...ఉత్సాహం



లాంచీని నడుపుతూ..



ప్రకృతి రమణీయం..

దూసుకొచ్చిన మృత్యువు

● ఇటుకల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. మహిళ మృతి


ట్రాక్టర్‌పై దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు



దామరచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. మట్టి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ఓ మహిళ మృత్యువాత పడింది. మరో ఇద్దరికి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి ఏపీలోని దాచేపల్లికి మట్టి ఇటుకలు దిగుమతి చేసేందుకు మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన మంద విమలమ్మ, నందిపాటి ఎల్లమ్మ, పోలెపల్లి మంగారమ్మ ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడి ఇంజిన్ వెనుక భాగంలో కూర్చున్న మంద విమలమ్మ(36)పై ఇటుకలు పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్లమ్మ, బంగారమ్మలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. విమలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త మెషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 36మంది ప్రయాణికులు ఉన్నారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు.

రోడ్డు దాటుతుండగా..

చిట్యాలరూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కోల్లా రఘునాథ్ గుప్తా(43) హైదరాబాద్ ప్రాంతంలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్నాడు. గుండ్రాంపల్లిలోని వెంచర్‌లో తనకున్న ప్లాటును చూసుకునేందుకు వచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో అవతలి వైపునకు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని..


శ్రీనివాసరావు(ఫైల్), మస్తాన్ మృతదేహం

మఠంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్‌సీఎల్‌లోని బైసన్ బోర్డులో పనిచేస్తున్న రఘునాథపాలెం గ్రామానికి చెందిన సంగు శ్రీనివాస్‌రావు, తన భార్య నీలిమాతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎస్‌సీఎల్ పరిశ్రమకు బయలు దేరాడు. పెదవీడు గ్రామానికి చెందిన అదే పరిశ్రమలో సిమెంట్‌లోడ్‌లో పనిచేస్తున్న షేక్ మస్తాన్ పెదవీడు నుంచి మఠంపల్లికి బైక్‌పై వెళ్తుండగా సాగర్ సిమెంట్స్ సమీపంలోని రైల్వే వంతెన వద్ద రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంగు శ్రీనివాస్‌రావు(31), షేక్ మస్తాన్(35) అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాస్‌రావు భార్య నీలిమాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో హుజూర్‌నగర్‌కు తర్వాత మెరుగైన చికిత్సకోసం కుటుంబసభ్యులు ఖమ్మం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాస్‌రావు భార్య ఎన్‌సీఎల్ పరిశ్రమలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో శనివారం సాయంత్రం భార్యాభర్తలు స్వగ్రామం రఘునాథపాలెం వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మస్తాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో రఘునాథపాలెం, పెదవీడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్

చందంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని ఓ గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసిన నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. వరుసకు బావ అయిన తిరుపతి ఈనెల 8వ తేదీన బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.

రైతుబీమా అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నారి అయిలయ్య


పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట పెట్టుబడి కోసం రైతు భరోసా పథకం, రైతులందరికీ గత ప్రభుత్వం మాదిరిగా ఉచిత బీమా సౌకర్యం అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్, సీపీఎం మండల కార్యదర్శి పెరిక విజయ్, నాయకులు చందునాయక్, మండల లక్ష్మమ్మ, చిరంజీవి, సత్యనారాయణచారి, దేవయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసమంతా..

శివలింగంపై భానుడి కిరణాలు

● భృగుమహర్షి పేరున బూరుగడ్డగా నామకరణం ● నాడు 108 శివాలయాలతో ఆధ్యాత్మికతకు చిరునామా




శివలింగంపై పడుతున్న సూర్యకిరణాలు, బూరుగడ్డలోని శివాలయం

భృగుమహర్షి తపస్సు చేసిన బూరుగడ్డ గ్రామం ఆధ్యాత్మికతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఆ మహర్షి పేరు మీదనే బూరుగడ్డ గ్రామంగా విరాజిల్లుతున్న ఈ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో విరాజిల్లుతోంది. ఒకనాడు 108 శివాలయాలతో వర్ధిల్లిన బూరుగడ్డ గ్రామం నేడు నల్లకట్ట సంతాన ఇష్టకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి శివలింగంపై సూర్యకిరణాల నృత్యాలతో ఎంతో విశిష్టతను సంతరించుకుంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని నల్లకట్ట సంతానకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 5వ తేదీన కార్తీకమాసం సందర్భంగా శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. కాగా ఉదయం 6 గంటల నుంచి 30 నిమిషాల పాటు శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఈ శివాలయంలో కార్తీకమాసం మొదటి రోజు నుంచి 30 రోజుల పాటు శివలింగంపై ఉదయం 6 గంటల నుంచి 6.30 గంట లవరకు సూర్యకిరణాలు ప్రకాశించడం ఈ ఆలయం ప్రత్యేకత అని అర్చకుడు రవీంద్రాచార్యులు తెలిపారు. భక్తులు కార్తీకమాసంలో అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. చైర్మన్ చిమ్మట చిన్న సైదులు, అర్చకుడు గుంటిపల్లి రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతున్నాయి. బూరుగడ్డ గ్రామంలోని నల్లకట్ట సంతాన కామేశ్వరి శంభులింగేశ్వరస్వామి దేవాలయాన్ని కాకతీయుల కాలంలో నల్లచెరువు కట్టపై నిర్మించగా, అది శిథిలావస్థకు చేరడంతో 2011లో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. 2012లో అప్పటి శివలింగాన్నే తిరిగి పునః ప్రతిష్ఠించారు. నాటి నుంచి ఈనాటి వరకు ప్రతి కార్తీకమాసంలో శివలింగాన్ని సూర్యకిరణాలు తాకుతుంటాయి. ఒకనాడు బూరుగడ్డలో 108 శివాలయాలు ఉండేవి. భృగు మహర్షి తపస్సు చేసిన ఈ ప్రాంతం శివాలయాలతో విరాజిల్లేది. కాగా 1800 సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో సత్రం బొల్లంరాజు బూరుగడ్డ గ్రామంలో శ్రీఆదివరాహ, లక్ష్మీనర్సింహ, శ్రీవేణుగోపాల స్వామి దేవతామూర్తులను ఒక పీఠంపై ప్రతిష్ఠింపజేశారు. కాగా రానురాను శివాలయాలు కనుమరుగు కాగా ప్రస్తుతం రెండే శివాలయాలున్నాయి. వాటిలో నల్లకట్ట సంతాన ఇష్టకామేశ్వరి సమేత శంభులింగేశ్వర స్వామి దేవాలయం ఒకటి కాగా, ఈ ఆలయం 2012 నుంచి ప్రతీ కార్తీకమాసం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంటూ కార్తీకమాసమంతా శివలింగంపై సూర్యకిరణాల వెలుగులు విరజిమ్ముతున్నాయి.

మిర్యాలగూడలో కార్డన్ సెర్చ్ .. వాహనాలు సీజ్


గాంధీనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను కార్డన్ సెర్చ్‌లో పోలీసులు సీజ్ చేశారు. నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు బృందాలుగా విడిపోయి నాకాబందీ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంట్లో తనిఖీలు జరిపారు. డీఎస్పీ మాట్లాడుతూ నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. నెంబరు ప్లేట్లు, ఆర్సీలు లేని 30 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎస్‌ఐలు మోహన్, కృష్ణయ్య, శేఖర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.150	220	250



సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.20
టీఎంసీలు	305.6242
ఎడమకాల్వకు నీటి విడుదల	3,608
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	00
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	18,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	21,600 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	21,600 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,828 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	12,000క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.87 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	518.51 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.01 క్యూసెక్కులు

చిట్టీల పేరిట జెన్‌కో ఉద్యోగి చీటింగ్

● రూ.93.18లక్షలు ఎగవేత ● నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి ఎస్‌ఈ వరకు బాధితులే

నాగార్జునసాగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల భవిష్యత్తు కోసం, ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇతర కుటుంబ అవసరాల కోసం డబ్బులు దాచుకోవాలని వారంతా చిట్టీలు వేశారు. నెలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును ఉద్యోగులందరూ కలిసి తోటి ఉద్యోగికి నమ్మకంతో ఇచ్చారు. చిట్టీ కట్టిన ఉద్యోగులకు సదరు వ్యక్తి తన భార్య పేరిట కోర్టు ద్వారా ఐపీ నోటీసులు(దివాలా దరఖాస్తు) పంపించడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో జెన్‌కో కార్యాలయ ఆర్టిజన్ తుర్క శ్రీనివాస్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2017లో అడవిదేవులపల్లిలోని టెయిల్‌పాండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి బదిలీపై వచ్చాడు. టెయిల్‌పాండ్ వద్ద పనిచేసిన సమయంలోనూ స్థానికంగా చిట్టీలు నిర్వహించాడు. అదే విధంగా సాగర్‌లో కూడా నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఎస్‌ఈ వరకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు చిట్టీలు వేయించాడు. చిటీలు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా అప్పు తీసుకున్నట్లు ఏడాదిగా ప్రామిసరీ నోట్లు రాసిస్తూ వచ్చాడు. సాగర్ జెన్‌కో కార్యాలయంలో పనిచేస్తున్న మొత్తం 40 మంది వద్ద సుమారు రూ.కోటి మేరకు చిట్టీలు వేయించాడు. చిట్టీ డబ్బులు ఇవ్వకుండా రెండు నెలలుగా కాలం వెలిబుచ్చుతుండటం, మాటలు మారుస్తుండటంతో తోటి ఉద్యోగులకు అనుమానం వచ్చింది. తమకు ఇవ్వాల్సిన నగదు త్వరగా చెల్లించాల్సిన గత నెలలో నిలదీశారు. దీంతో శ్రీనివాస్ సదరు ఉద్యోగి నాలుగు రోజులు విధులకు హాజరు కాకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్‌చేసి ఉండటం, స్థానికంగా లేకపోవటంతో సాగర్ హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆచూకీ తెలుసుకుని సాగర్‌కు రావాలని చెప్పటంతో ఈ నెల 1వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అందరి డబ్బులు ఇస్తానని ఎస్‌ఐ సంపత్ ఎదుట అంగీకరించాడు. ఈ నెల 5వ తేదీనుంచి చిట్టీ కట్టిన చిరుద్యోగి నుంచి ఎస్‌ఈ వరకు మొత్తం 37 మందికి రూ.93.18 లక్షలకు కోర్టు ద్వారా తన భార్య లక్ష్మీపద్మావతి పేరిట ఐపీ నోటీసులు (దివాలా దరఖాస్తు) పంపించాడు. దీంతో బాధితులు తమ గోడును విలేకరుల ఎదుట వెళ్లబోసుకున్నారు. తాము కట్టిన చిట్టీ డబ్బుతో తుర్క శ్రీనివాస్ ఆయన భార్య లక్ష్మీపద్మావతి పేరిట ఆంధ్రప్రదేశ్‌లో భూములు కొన్నాడని బాధితులు చెబుతున్నారు. డబ్బులు ఇవ్వకుండా ఉండాలనే భార్య పేరున ఐపీ నోటీసులు పంపించాడని ఆరోపిస్తున్నారు. తమను మోసం చేసిన శ్రీనివాస్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

విహారయాత్రలో విషాదం

● కృష్ణానదిలో నీటమునిగి యువకుడు మృతి


అనిల్ మృతదేహం

నేరేడుగొమ్ము, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆ యువకుల విహార యాత్ర విషాదంగా మారింది. వారిలో ఓ యువకుడు నీటి మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ ఆదివారం జరిగింది. నేరేడుగొమ్ము ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన కొమ్ము రాములు, నాగమ్మ దంపతుల కుమారుడు అనిల్(24) పది సంవత్సరాలుగా సికింద్రాబాద్‌లోని బోయపల్లిలో నివాసముంటున్నాడు. అక్కడే ఓ ప్రైవేట్ కోరియర్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతని స్నేహితులు అప్పారావు, అశోక్ అదే సంస్థ పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు వైజాగ్‌కాలనీ విహార యాత్రకు వచ్చారు. కొమ్ము అనిల్ కృష్ణానదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో వైజాగ్‌కాలనీ మత్స్యకారులు అటుగా వచ్చి నీటిలో మునిగిన అనిల్‌ను బయటికి తెచ్చారు. అప్పటికే అనిల్ మృతిచెందాడు. స్థానికులు, స్నేహితులు నేరేడుగొమ్ము పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనిల్ తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనిల్‌కు భార్య సంధ్య, కుమారుడు ఉన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య


వెంకన్న (ఫైల్)

నల్లగొండ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబసమస్యల కారణంగా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన కడారి వెంకన్న అలియాస్ కోటి(52) ఆదివారం పట్టణ శివారులోని ఓ తోట దగ్గరల్లో ఉన్న వెంచర్‌లో చెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. వెంకన్న కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. యాదవ సంఘంలో చురుకుగా పనిచేస్తున్నాడు. వెంకన్న కుమారుడు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గుర్రంపోడు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఆదివారం 10.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు కిరాణా వ్యాపారులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో కిరాణ వ్యాపారులు రేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని అక్రమంగా సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న సమాచారం మేరకు ఎస్ మధు, సిబ్బందితో కలిసి దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన తేలుకుంట్ల యాదయ్య వద్ద ఐదు క్వింటాళ్ల, దాచేపల్లి వెంకటయ్య వద్ద అక్రమంగా నిల్వఉంచిన 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరుగాలం కష్టం రోడ్డు పాలు..

● ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం.. రోడ్డుపై పడిపోయిన ధాన్యం




ట్రాక్టర్ ట్రాలీ నుంచి రోడ్డుపై పడిపోయిన ధాన్యం, ధ్వంసమైన ట్రాక్టర్ ఇంజన్

వేములపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించడానికి తీసుకెళ్తుండగా రోడ్డు పాలైంది. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన రైతు జక్కలి మంగయ్య శనివారం సాయంత్రం రెండు ఎకరాల పొలం కోసి తన ట్రాక్టర్‌లో ఆదివారం ఉదయం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోగల మిల్లుల వద్దకు చేరుకున్నాడు. మహర్షి రైస్‌మిల్లు సమీపంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న సుమారు 75బస్తాల ధాన్యం(44 క్వింటాళ్లు) రోడ్డుపై పడింది. ట్రాక్టర్ ఇంజన్ దెబ్బతిని రెండుగా విడిపోయింది. రైతు మంగయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధాన్యాన్ని మరో ట్రాక్టర్‌లో లోడ్ చేయించి మిల్లుకు తరలించారు. 40 క్వింటాళ్లు విక్రయించగా, సుమారు నాలుగు క్వింటాళ్ల ధాన్యం మట్టిపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు రూ.10వేల నష్టం వాటిల్లిందని, ట్రాక్టర్ ఇంజన్, ట్రక్కు దెబ్బతినడంతో సుమారు రూ.7లక్షల వరకు నష్టపోయానని వాపోయాడు.

సీఎం, మంత్రికి మంచి బుద్ధి ప్రసాదించాలి

● యాదాద్రి భువనగిరి జిల్లా సంగెంలో భీమలింగేశ్వరుడికి అభిషేకాలు


సంగెంలో భీమలింగానికి పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వలిగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్‌ఎస్ నాయకులు భీమలింగేశ్వరుడిని వేడుకున్నారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో భీమలింగానికి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కీసర రాంరెడ్డి, కాసుల కృష్ణ, వరికుప్పల మల్లేష్ మాట్లాడుతూ ఈ నెల 8న మూసీ పునరుజ్జీవ యాత్ర పేరుతో సంగెం గ్రామానికి సీఎం, జిల్లా మంత్రి వచ్చిన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. 'బుల్డోజర్లతో తొక్కిస్తా.. కుక్క చావు చస్తావు' అంటూ హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడారని సీఎం, మంత్రిపై వలిగొండ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ కో-ఆర్డినేటర్ పడమటి మమత, నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, అఫ్రోజ్, పల్సం రమేష్, నాయకులు వలమల్ల కృష్ణ, మద్దెల మంజుల, డేగల పాండు, ఎడ్ల నిరంజన్‌రెడ్డి, మద్దెల సందీప్, మారయ్య, శేఖర్, నరేష్ పాల్గొన్నారు.

తప్పులు దొర్లకుండా సర్వే నిర్వహించాలి

● ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తప్పులు దొర్లకుండా ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి ఎన్యూమరేటర్లను కోరారు. దేవరకొండ మునిసిపాలిటీతో పాటు మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా సమగ్ర వివరాలతో చేపట్టాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఎన్యూమరేటర్లు స్పెషల్ అధికారులతోపాటు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలందరూ సమగ్ర సర్వేకు సహకరించాలని కోరారు. ఆయన వెంట దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



కొండభీమనపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

దగాపడుతున్న ధాన్యం రైతు

(5పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు చేయకుండా, రోజుకు కొన్ని మిల్లుల్లోనే ధాన్యం కొనుగోలు చేసేలా అవగాహనతో వ్యవహరిస్తూ ధర తగ్గించారని, ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టిసారించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



మిల్లు పాయింట్ల వద్ద మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే హెచ్చరించినా

వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పలుమార్లు మిల్లర్లతో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ సమావేశాలు నిర్వహించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిలేది లేదని, కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,400 ఇస్తామని ఈ సమావేశాల్లో మిల్లర్లు హామీ ఇచ్చినా, ధాన్యం ఎక్కువగా వస్తున్న తరుణంలో ఉన్నట్లుండి ధర తగ్గించారు. ఆదివారం సైతం మిల్లుల వద్ద రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శెట్టిపాలెం మిల్లుల వద్దకు వచ్చి రైతులతో, మిల్లర్లతో మాట్లాడి ధర ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనతో మద్దతు ధర ఇస్తామని మిల్లర్లు హామీ ఇచ్చి కాంటాలు మొదలుపెట్టారు. అయితే ఎమ్మెల్యే వెళ్లిపోయిన కొద్దిసేపటికే మిల్లర్లు మళ్లీ కాంటాలు నిలిపారు. చేసేది లేక మిల్లర్లు చెప్పిన ధరకే రైతులు ధాన్యం విక్రయించి వెళ్లారు. నాణ్యతాప్రమాణాలున్న ధాన్యానికి మిల్లుల్లో కనీస మద్దతు ధర ఇవ్వకపోతే రైతులు ఫిర్యాదు చేస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని వేములపల్లి తహసీల్దార్ కోటేశ్వరి పేర్కొన్నారు. మిల్లుల్లో ధర తక్కువ వస్తే తనకు ఫోన్ చేయాలని, రైతులెవ్వరూ తక్కువ ధరకు విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన సన్న ధాన్యం కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతో పాటు, క్వింటాకు రూ.500 బోనస్ కూడా వస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రైతులకు సూచించారు.

అన్ని మిల్లుల్లో కొనుగోలు చేయాలి



ధాన్యం కొనుగోళ్లలో సాకులు చెప్పకుండా మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యాన్ని అన్ని మిల్లులు కొనుగోళ్లు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మిల్లుల వద్ద అధికంగా ధాన్యం వచ్చిన సందర్భంలో ధరలో కోత విధిస్తూ రైతులు నష్టపోయేలా చేయడం సరికాదు. మహేంద్ర చింట్లు, ఇతర సన్న ధాన్యం కొనుగోలు చేయకపోవడం నిబంధనలకు విరుద్ధం. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేలా ఆదేశాలివ్వాలి.

● అయితగాని రవి, రైతు, ఆలగడప

ధాన్యం ఖరీదు చేయడం లేదు



అర్ధరాత్రి నుంచి మిల్లు వద్ద పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ఎలాంటి కారణమూ చెప్పడం లేదు. ఖరీదు చేయలేమని చెబుతున్నారే తప్ప కారణం చెప్పడం లేదు. చింట్లు రకం ధాన్యం 70 బస్తాలు తీసుకొచ్చా. కనీస ధరకు రూ.10 తక్కువ ఇచ్చి కొనుగోలు చేయాలని వేడుకున్నా పట్టించుకోవడం లేదు. మిల్లుల వద్ద ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

● సూదిరెడ్డి నర్సిరెడ్డి, రైతు, నకిరేకల్

అధికంగా ధాన్యం తరలివచ్చింది

సాధారణ రోజుల్లో కంటే ఆదివారం మిల్లులకు ధాన్యం లోడ్ తక్కువగా వస్తుంది. దీనికి భిన్నంగా ఈ ఆదివారం సుమారు 3వేల ట్రాక్టర్ల ధాన్యం రావడంతో సమస్య తలెత్తింది. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా మిల్లర్లు సహకరించారు. 3వేల ట్రాక్టర్లతోపాటు అదనంగా వచ్చిన ధాన్యం సైతం కొనుగోలు చేశాం. ధాన్యం తేమ శాతం 25 నుంచి 28 ఉన్నా మద్దతు ధర అందేలా కృషి చేస్తున్నాం. రైతులు ఒకేసారి కోతలు చేపట్టకుండా సహకరించాలి.

● గౌరు శ్రీనివాస్, మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

రైతులకు ధర ఇప్పిస్తాం, ఆందోళన వద్దు

రైతులెవ్వరూ తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దు. ప్రతీ గింజకు కనీస మద్దతు ధర ఇప్పించడమే మా లక్ష్యం. మిల్లర్లు ఎవరైనా ధర ఇవ్వకపోతే నాకు నేరుగా ఫోన్‌చేయండి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కూడా సన్నధాన్యం సేకరిస్తోంది. అక్కడ విక్రయిస్తే కనీస మద్దతు ధరతో పాటు, క్వింటాకు రూ.500 బోనస్ కూడా వస్తుంది. రైతులెవ్వరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



చందంపేట మండలంలో దుక్కులు దున్నుతున్న రైతు

యాసంగి సాగుకు సన్నద్ధం

● దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

చందంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చందంపేట మండలంలో రైతులు ఈ యాసంగి సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో భూగర్భజలాలు సంవృద్ధిగా పెరిగాయి. మండలంలోని చందంపేట, తెల్‌దేవరపల్లి, మురుపునూతల, ముదుదండ్ల, చిత్రియాల గ్రామాల్లో మండలవ్యాప్తంగా 20 నుంచి 30వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడి అంతంతమాత్రంగానే ఉండటంతో రైతులు ప్రత్యామ్నాయంగా వేరుశనగ సాగుకు మొగ్గు చూపుతున్నారు. వేరుశనగ సాగుకు ఎకరానికి రూ.10 నుంచి 15 వేల వరకు పెట్టుబడి అవుతుందని, పంట దిగుబడి ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు రావడం, ఎక్కువగా పెట్టుబడి ఖర్చులు ఉండకపోవడంతో రైతులు ఆ పంటపై ఆసక్తి చూపుతున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి

నిడమనూరు, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆదివారం నూతన చైర్మన్ అంకతి సత్యంను బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా పరమేష్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలు అన్ని రంగాలతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా మరింత ఎదగాలన్నారు. ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీసంఘం నాయకులు విశ్వనాథుల రమేష్, పగిళ్ల శివ, కోమటి వెంకన్న, గాయకవాడ లక్ష్మీనారాయణ, తుడిమిళ్ల వెంకటాచారి, కొమ్మగోని శ్రీనివాస్, శంకర్, జ్ఞానేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.



సత్యంను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

ప్రభుత్వంపై చిరుమర్తి దుష్ప్రచారం

కేతేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఆయన చేసిన ఆరోపణలు అర్థంలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పదవీకాలంలో ప్రజలకు ఏమాత్రం మేలు చేయని మాజీ ఎమ్మెల్యే నేడు ప్రజాపాలనను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 2లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, నివాసగృహాలకు రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే వంటగ్యాస్ సరఫరా వంటి కార్యక్రమాలు చిరుమర్తికి కనిపించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎ.మహేందర్‌రెడ్డి, ఎ.వీరాచారి, బయ్య ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందించాలి

దేవరకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పింఛనర్లు, ఉద్యోగులకు హెల్త్‌కార్డుపై కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించాలని దేవరకొండ నియోజకవర్గ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాటిశెట్టి నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగసంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛనర్లకు ఒక శాతం పే నుంచి తీసుకొని కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్య సౌకర్యం కల్పించాలని, మిగిలిన నాలుగు వాయిదాల డీఆర్ మంజూరు చేయాలని ఆయన కోరారు. పీఆర్సీ వెంటనే అమలు చేసి బకాయిలు నగదుగా చెల్లించాలన్నారు. మెడికల్ బిల్లులు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల గ్రాట్యూటీని వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి, నాయకులు గంగిడి దామోదర్‌రెడ్డి, కంచర్ల నారాయణరెడ్డి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



సంఘ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు నర్సింహ

జనరంజకంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన

● టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్

నల్లగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, పరిపాలన జనరంజకంగా సాగుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆరు గ్యారంటీ పథకాలు నిరుపేద వర్గాల అభ్యున్నతికి తోడ్పడుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని అన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా మూసీ మురికితో జిల్లా ప్రజలు దెబ్బతింటుంటే శుద్ధి చేసి ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తామన్నా సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పానికి పార్టీలకతీతంగా మద్దతు తెలపాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, డిండి, ఉదయసముద్రం, బ్రాహ్మణవెల్లెంల, చర్లగూడ, కిష్టరాంపల్లి, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలను ఎందుకు పూర్తి చేయలేదన్నారు. 90శాతం పనులు పూర్తి చేసిన ఘనత మంత్రి కోమటిరెడ్డికే దక్కుతుందని గుర్తు చేశారు. దొరల గడీల పాలనను అంతం చేసి ప్రజాస్వామ్య పాలన అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీ, ఎస్సీ ఎ స్టీ, మైనార్టీల పక్షపాతి అని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా తెలంగాణలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ప్రసాద్‌గౌడ్, నాగార్జున, సాయితేజ, శరత్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పున్న కైలాష్ నేత

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు : చిరుమర్తి

కట్టంగూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీలు దొందూ.. దొందేనని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు బీజేపీ బీటీఎంగా మారిందని అన్నారు. మూసీలో లక్షల కోట్లు అవినీతి జరుగుతుందని తెలిసి కూడా కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ధనదాహాన్ని, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. త్వరలో బీజేపీ, రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం బట్టబయలు కావడం తథ్యమన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, నాయకులు పెద్దిబాల నర్సింహ, దాసరి సంజయ్, వడ్డే సైదిరెడ్డి, అంతటి శ్రీను, గడుసు కోటిరెడ్డి, పిన్నపురెడ్డి నర్సిరెడ్డి, బీరెల్లి ప్రసాద్, గడుసు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

యువతకు ఉపాధి కల్పించడంలో విఫలం

చిట్యాలరూరల్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ అన్నారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలలోని చిట్యాల మండలం వెలిమినేడు, పిట్టంపల్లి గ్రామాల్లో ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భవిష్యత్తును నిర్ణయించేది యువతేనని, ప్రభుత్వ పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ ఆచరణలో మాత్రం చూపకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఖాళీలు ఉన్నా భర్తీ చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నా కూడా పెడచెవిన పెట్టడం సిగ్గుచేటన్నారు. యువత సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లం మహేష్, వడ్డగాని మహేష్, మెట్టు నర్సింహ, మెట్టు పరమేష్, దేశబోయిన నర్సింహ, ఆడెపు రమేష్, గడ్డం నర్సిరెడ్డి, నర్సింహ, బసవయ్య, గోపాల్, బాలు, సాయికిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.



వెలిమినేడులో డీవైఎఫ్ఐ జెండావిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఇళ్ల స్థలాల పంపిణీని మరిచిన పాలకులు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం భూమిని కొనుగోలు చేసి 20 సంవత్సరాలైనా పాలకులు వాటిని పంపిణీ చేయడం మరిచిపోయారని సీపీఎం మండల సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ చాంద్‌పాషా అన్నారు. సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాజవరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వా రు మాట్లాడారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం గ్రామంలో 4 ఎకరాల భూమిని గతంలో కొనుగోలు చేశారని తెలిపారు. అయితే ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నేటికి ఆ భూములను ప్లాట్లుగా చేసి పేదలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బుర్రి సైదయ్య, కటకం బ్రహ్మయ్య, బుర్రి మధు, కొండలు, బొడ్డు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషిచేయాలి

చండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘం బలోపేతంతో పాటు సామాజికసేవ, పేద ఆర్యవైశ్యులను ఆదుకోవడంలో ముందుండాలని ఆయన సూచించారు. అనంతరం చండూరు మండల, పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులుగా తడకమళ్ల శ్రీధర్, తాడిశెట్టి సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి వెంకన్న, కోశాధికారి దాచేపల్లి సంపత్, పట్టణ కార్యదర్శిగా వాస రాంబాబు, సోమవారపు చంద్రుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

సంప్రదాయాలను కాపాడటమే లక్ష్యం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే లక్ష్యంగా తె లంగాణ రాష్ట్ర గిరిజన సంఘం (టీఆర్‌జీఎస్) కృషి చేస్తుందని గిరిజన సంఘం నాయకులు కొర్ర శంకర్‌నాయక్ అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఆ విర్భావ సభకు నియోజకవర్గానికి చెందిన పలు గిరిజన సంఘాల నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంఘాన్ని జిల్లా, మండలాల్లో నూతన కమిటీల ఏర్పాటు చేసి బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మెరావత్ మునినాయక్, దెపావత్ శివాజీనాయక్, రమావత్ నరేష్‌నాయక్, పాల్తి సురేష్, మెగావత్ భాస్కర్, రమావత్ లాలు, రమేష్‌నాయక్, రమావత్ రవీందర్, నేనావత్ అశోక్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

జరిమానేగా... వేసుకోనీ!

(5పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు. రెండేళ్ల కాలంలో జిల్లాలో 71,076 కేసులు నమోదయ్యాయి. 2023లో మొత్తం 47,167 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 23,909 కేసులు నమోదయ్యాయి. డిసెంబరు నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది వాహనదారులకు రూ.4,30,76,300 జరిమానా విధించగా, ఈ ఏడాది రూ.2,22,69,700 జరిమానా రూపంలో వసూలైంది.

నూతన టెక్నాలజీ తెచ్చినా

ప్రభుత్వం పోలీస్‌శాఖకు అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. అయినా వాహనదారుల్లో మార్పు రావడం లేదు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో అధునాతన సిగ్నల్స్‌తో పాటు సీసీ కెమెరాలు, ఇతర సౌకర్యాలను సమకూర్చింది. పోలీస్‌శాఖ కూడా ప్రధాన కూడళ్ల వద్ద అధిక సంఖ్యలో కెమెరాలు, సిగ్నల్స్ ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రంలో మర్రిగూడ బైపాస్ నుంచి కలెక్టరేట్, దేవరకొండ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, నకిరేకల్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో అధునాతన కెమెరాలు అమర్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను వీటిద్వారా పసిగట్టి జరిమానా విధిస్తున్నా పట్టించుకోవడం లేదు. చర్లపల్లి బైపాస్ మర్రిగూడ సర్కిల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంలో ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలో వాహనాలు వేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై కఠిన చర్యలు

నేరాల నియంత్రణకు జిల్లాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ట్రిపుల్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకూ 23,909 కేసులను నమోదు చేసి వాహనదారులపై చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటాం. ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేలా జాగ్రత్తగా వాహనాలు నడపాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకారం అందించాలి.

● శరత్‌చంద్ర పవార్, ఎస్పీ

సమాచారం

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడిగా పన్నాల గోపాల్‌రెడ్డి మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం ఆదివారం జిల్లా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా పన్నాల గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా గుండెబోయిన నాగేశ్వర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు పులి పాపయ్య, కార్యదర్శిగా లావూరు క్రాంతికుమార్‌ను నియమించారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శనివారం నల్లగొండలో జరిగిన టీజేఎస్ ప్లీనరీ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. 2025 మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో టీజేఎస్ అభ్యర్థిగా పన్నాల గోపాల్‌రెడ్డిని పోటీకి నిలపాలని సమావేశంలో తీర్మానం చేశారు. గోపాల్‌రెడ్డి గతంలో ఉపాధ్యాయ సంఘాలైన ఏపీటీఎఫ్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి మూడు జిల్లాలతో సంబంధం ఉన్నందున ఎమ్మెల్సీ ఎన్నికలో నిలపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో టీజేఎస్ బలోపేతం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.



పన్నాల గోపాల్‌రెడ్డి

యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్

డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత ఐక్య వేదిక యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డిండి మండల కేంద్రానికి చెందిన గుర్రం సురేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చేనేత కార్మికులలో చైతన్యం తీసుకు వచ్చేందుకు, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



గుర్రం సురేష్

టీఎస్‌యుటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాంబాబు

మాడ్గులపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యుటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని తోపుచర్ల ఉపాధ్యాయుడు కుంచం రాంబాబు ఎన్నికయ్యారు. ఆదివారం నూతనంగా ఎన్నికైన రాంబాబు మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన సంఘ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులుకు, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో సంఘం బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మండల ప్రధాన కార్యదర్శిగా అందె సైదయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.శేఖర్‌రెడ్డి, జానిబేగం, కోశాధికారిగా కె.రాధికలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



కుంచం రాంబాబు

ఏఐటీయూసీ జిల్లా శిక్షణ తరగతులు

చింతపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని కరీం ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులందరూ సకాలంలో హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సంక్షిప్తం

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

చిట్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణానికి చెందిన రైస్‌మిల్ డ్రైవర్ దండిగ నర్సింహ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చేయి పోగుట్టుకున్నాడు. ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు కోనేటి ఎల్లయ్య 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆగు అశోక్, ఇరగదిండ్ల గణేష్, మేకల భిక్షం తదితరులు పాల్గొన్నారు.

రూ.75 వేల ఆర్థికసాయం

కొండమల్లేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పంగ శ్రీను ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతని 10వ తరగతి స్నేహితులు ఆదివారం కుటుంబసభ్యులకు రూ.75 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీ క్రాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుంటోజు ఆంజనేయులు, పంగ యాదయ్య, ఆరీఫ్, మధు, శివ, హిమాకార్, యుగంధర్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

తిరుమలగిరి(సాగర్): ఎల్లాపురం గ్రామంలోని దళితుల భూమి విషయంలో జోక్యం చేసుకుంటున్న జర్నలిస్టుపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, బీఎస్పీ, టీఎంఎస్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గార్లపాటి ప్రసాద్, కత్తుల రవన్న, శ్రీను, కోటేష్, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.